క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11.00 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

పనిచేస్తున్న యుబీడీ ఆన్‌లైన్ సర్వర్



తెనాలిఅర్బన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలో రెండు నెలల నుంచి నిలిచిపోయిన యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్ సర్వర్ మంగళవారం నుంచి పనిచేస్తోందని ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల తెలిపారు. 2016కు ముందు తెనాలి పురపాలక సంఘ పరిధిలో నమోదైన బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీకి ప్రభుత్వం యూబీడీ సర్వర్‌ను ఉపయోగించిన విషయం తెలిసిందే. అది రెండు నెలల నుంచి మొరాయించడంతో సర్టిఫికెట్ల జారీ రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయింది. దానిని మరలా ఉన్నతాధికారులు పునరుద్ధరించడంతో సర్వర్ పనిచేస్తోందని వివరించారు. దీని వలన తెనాలి పట్టణంలో 270 సర్టిఫికెట్ల జారీ నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. సర్వర్ పనిచేస్తుండటంతో సర్టిఫికెట్ల జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 80 సర్టిఫికెట్లు జారీ చేశామని, మిగిలినవి కొద్ది రోజుల్లో జారీ చేస్తామని ఆమె తెలిపారు.

కవితా స్రవంతి జీవనరేఖలు పుస్తకావిష్కరణ



నగరంపాలెం: జీవన రేఖలు పుస్తకంలో రచయిత నూతలపాటి సాంబయ్య పలు ప్రజాహిత విషయాలను ప్రస్తావించారని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం కళావిపంచి(హైదరాబాద్), ఆరాధన అకాడమి(గుంటూరు) ఆధ్వర్యంలో కళాసారథి నూతలపాటి సాంబయ్య కవితా స్రవంతి జీవనరేఖలు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. అనంతరం మస్తానయ్య, అతిథులు పుస్తకావిష్కరణ చేశారు. వెలగపల్లి సాయిపద్మశ్రీ(విజయవాడ) కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాపోషకులు వజ్జా మధుసూదనరావు, కవి సాహితీ విశ్లేషకులు డాక్టర్ బీరం సుందరరావు, విశ్రాంత ఆచార్యులు వాసిరెడ్డి సత్యనారాయణవరప్రసాద్, కవి గ్రంథకర్త నూతలపాటి సాంబయ్య, బండారుపల్లి రామారావు, నర్రా శ్రీనివాసరావు, జంపని కిషోర్‌బాబు, కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, ఆరాధన ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు డి.తిరుమలేశ్వరరావు, జీవీజీ శంకర్, సయ్యద్ జానీబాషా, జి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో సమస్యల తిష్ట

- డ్రెయినేజీ వ్యవస్థ మరమ్మతులతో నిర్వాసితులకు ఇక్కట్లు
- ప్రమాదభరితంగా మారిన సెప్టిక్ ట్యాంక్, మ్యాన్ హోల్స్



రాజీవ్ గృహకల్ప సముదాయం



సెప్టిక్ ట్యాంక్‌కు ఉన్న రంధ్రాలు



మురుగు కాలువలో వ్యర్థాలు

తెనాలిఅర్బన్: చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్ప సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పాడైన డ్రెయినేజీ వ్యవస్థ, అస్తవ్యస్తంగా మ్యాన్ హోల్స్, ప్రమాదభరితంగా మారిన సెప్టిక్ ట్యాంక్‌తో ఆప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ప్రయోజనంలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చేసేదిలేక వారికి మురుగుతోనే జీవనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మారీసుపేట చంద్రబాబు నాయుడు కాలనీలో 2009లో రాజీవ్ గృహకల్పను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నిర్మించారు. దానిని ఆయనే స్వయంగా తెనాలి వచ్చి స్వయంగా ప్రారంభించారు. అక్కడ 13 బ్లాక్‌లలో సుమారు 425 అపార్ట్‌మెంట్‌లను నిర్మించి పేదలకు ఇచ్చారు. అప్పట్లో అక్కడ అంతర్గత రోడ్లు, డ్రెయినేజ్, సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. కాలక్రమీణ సెప్టిక్ ట్యాంక్ నిండిపోవటం... గత ఏడాది దానిని బాగు చేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అప్పటి కాంట్రాక్టర్ దానిలోని వ్యర్థాలను తోడేందుకు ట్యాంక్‌ను పలుచోట్ల పగులకొట్టి దానిలోని వ్యర్థాలను తోడారు. అప్పటి నుంచి దానిపై ఉన్న రంధ్రాలను అలానే వదిలేశారు. దీనివల్ల వర్షపు నీరు దానలో చేరి నిండిపోవటం, ఆప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో అటువైపు వెళ్లిన వారు దానిలో పడి గాయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోల్స్‌ను మూయించాలని కౌన్సిలర్ లక్ష్మి లవణ్య అనేక సార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం కన్పించటం లేదు.

పాడైన డ్రెయినేజ్ వ్యవస్థ

రాజీవ్ గృహకల్పలోని అంతర్గత డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పోయే దారిలేక అక్కడే నిలచిపోతున్నాయి. దీనివల్ల కాల్వలు అన్ని దుర్గంధభరితంగా మారాయి. అలాగే దోమల ఉధృతి కూడా పెరిగిందని, అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు తెలిపారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్‌కు మూతలు లేకపోవటం వల్ల చిన్నపిల్లలు దానిలో పడిపోతున్నారని వారు చెప్పారు. వెంటనే అధికారులు స్పందించి డ్రెయినేజ్ వ్యవస్థలను బాగు చేయించటంతో పాటు సెప్టిక్ ట్యాంక్‌కు ఉన్న రంధ్రాలు పూడ్చాలని, మ్యాన్ హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



రాజీవ్ గృహకల్పలో అనేక సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. సరైన డ్రెయినేజ్ వ్యవస్థ లేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మురుగు కాల్వలను కూడా బాగు చేయకపోవటం వల్ల మురుగు అక్కడే నిలచిపోయి దుర్గంధభరితంగా మారింది. అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరు చేశారు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు.

– పెదలంక లక్ష్మిలావణ్య, కౌన్సిలర్, 24వ వార్డు

డ్రెయినేజ్‌కు మరమ్మతులు

రాజీవ్ గృహకల్పలోని డ్రెయినేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. వారం రోజుల్లో మ్యాన్‌హోల్స్, సెప్టిక్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయిస్తాం. అలాగే మురుగు కాల్వలో మురుగు పోయే విధంగా చూస్తాం.

–శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్, తెనాలి మున్సిపాలిటీ.

కుక్కల శస్త్ర చికిత్సాలయాన్ని ఉపయోగంలోకి తేవాలి

కమిషనర్ శేషన్న



కుక్కల శస్త్ర చికిత్సాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, ఎంఈ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: కుక్కల శస్త్ర చికిత్సాలయాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును మంగళవారం ఆయన పరిశీలించారు. కుక్కల శస్త్ర చికిత్సాలయంలో వర్షపు నీరు చేరడాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంపోస్టు యార్డులోని వ్యర్థాల సమస్యను కూడా త్వరగా పరిష్కరించే విధంగా చూడాలన్నారు. అనంతరం 29వ వార్డు మార్కెట్ యార్డులోని అన్న క్యాంటీన్ మరమ్మతులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అదే వార్డులోని మురుగు నీరు పంపింగ్ హౌస్‌ను పరిశీలించి దాని పనితీరుపై ఆరా తీశారు. పంపింగ్ హౌస్ నిత్యం పనిచేసేలా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, డీఈ నాగభూషణం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఏఈ రాజు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్ బాబు, ముసుగులో ఉన్ననిందితుడు

పట్నంబజారు: చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వి.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. ఈనెల 27న సీతారామ్‌నగర్‌లో నివాసం ఉండే కల్లూరి వేణుగోపాల్ నివాసంలో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ పుటేజ్ సమాచారం ఆధారంగా పాత నేరస్తుడే చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గతంలో పలు కేసులు ఉన్న శివ నాగరాజుకాలనీకి చెందిన ఎర్రసాని రాజు అలియాస్ ఇమ్మానియేలు చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. మంగళవారం కాకాని రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజును అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అదేవిధంగా 2022లో పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో చేసిన మరో చోరీకి సంబంధించిన సొత్తు కలిపి రూ. 3.50 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, నూరుద్దీన్, శామ్యూల్‌రాజు, రాములను సీఐ రమేష్ అభినందించారు. ఈమేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు అమరవర్ధన్, భాగ్యరాజు పాల్గొన్నారు.

లైన్‌లో వేచి ఉండకండి.. ఆన్‌లైన్‌లోకి మారండి

- రైల్వే రిజర్వేషన్ రహిత టికెట్లు ఆన్‌లైన్‌లో లభ్యం
- యూటీఎస్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి
- ఉచితంగా రిజిస్టర్ అవ్వండి
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో అవగాహన

లక్ష్మీపురం: ప్రస్తుతం ప్రజలు టెక్నాలజీపై మోజు పెరిగింది. రైల్వే శాఖ సాంకేతిక టెక్నాలజీ విస్తృతంగా వినియోగిస్తోంది. దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణికుల సౌకర్యార్థం వినూత్నంగా సేవలు అందిస్తున్నారు. 2018 జూలై 16న దక్షిణ మధ్య రైల్వే ఆన్‌లైన్ టికెట్ల కోసం ప్రయాణికులకు సేవలు అందించేందుకు యూటీఎస్ యాప్‌ను ప్రవేశ పెట్టిన విషయం విధితమే. అయితే ఈ యాప్‌ను అన్ని డివిజన్‌లలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రయాణికులకు ఈ యాప్ గురించి అవగాహన కల్పించాల్సిందిగా దక్షిణ మధ్య రైల్వే జీఎం స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో గుంటూరు డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ దీన్ని విస్తృతం ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



యూటీఎస్ మొబైల్ యాప్ లోగో

అవగాహన కార్యక్రమాలు..

గుంటూరు రైల్వే స్టేషన్‌లో డివిజన్ సీనియర్ డీసీఎం కమలాకర్ బాబు ప్రయాణికులకు యూటీఎస్ యాప్ గురించి అవగాహన కల్పించి మొబైల్ ఫోన్‌లలో యాప్‌లను డౌన్‌లోడ్ చేసే విధానాన్ని తెలియజేస్తున్నారు. డివిజన్‌లో ఆయా స్టేషన్‌లలో యూటీఎస్ ఆన్‌లైన్ టికెట్ల యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ యాప్‌ను వినియోగించడం వలన ప్రయాణికులకు కాగితంపై వివరాలను రాయాల్సిన అవసరం ఉండదు. ప్రయాణికుడి చేతిలో యాండ్రైడ్ మొబైల్ ఉండి దానిలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకుంటే చాలు అన్ని అధికారులు చెబుతున్నారు. రైల్వే అధికారులు కాగితం అక్కరలేని సాధారణ ప్రయాణ టికెట్లు కొనడానికి స్మార్ట్ ఫోన్ ఉపయోగించమని అంటున్నారు. ఈ యాప్ ద్వారా రైల్వే ప్రయాణికులు సీజన్ టికెట్లు, ప్లాట్ ఫారం టికెట్లు కొనుగోలు కోసం యూటీఎస్ యాప్ ఉపయోగించాల్సిందిగా కోరుతున్నారు.


ఆర్–వేలెట్ రీచార్జి ఇలా చేసుకోవాలి....

- యూటీఎస్ మొబైల్ యాప్
- డెబిట్ కార్డ్
- నెట్ బ్యాంకింగ్
- వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ యూటీఎస్ ఓఎన్‌మొబైల్.ఐఎన్‌డీఐఏఎన్‌రైల్వే.జీఓవి.ఐన్‌లో కూడా టికెట్స్ పొందవచ్చు.
- రూ.100 నుంచి గరిష్టంగా రూ.10 వేల వరకు రీచార్జి చేసుకోవచ్చు. ప్రతి రీచార్జిపై 5 శాతం అదనపు బోనస్ పొందవచ్చు.

టికెట్‌లు బుక్ చేసుకోవడానికి..

- ఆండ్రాయిడ్, విండోస్ లేక ఐఫోన్ స్మార్ట్ ఫోన్ ద్వారా యూటీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలి.
- మొదటి సారి ఉపయోగించే వారు సైన్ అప్ చేయాలి. ఇప్పటికే వినియోగిస్తున్నవారు పాస్వర్డ్‌తో నేరుగా లాగిన్ చేయాలి
- డ్రాప్ డౌన్ మెను నుంచి స్టేషన్‌ని ఎంపిక చేసుకోవాలి
- తరుచుగా ప్రయాణించే వారు క్విక్ బుకింగ్ ఎంపిక చేసుకోవాలి
- ఆర్–వేలెట్, పేటీఎం, మొబిక్విక్, ఉపయోగించి టికెట్లు కొనుగోలు చేసుకోవాలి.

కాగితం అవసరంలేని యూటీఎస్ యాప్



ఈ యాప్‌ను వినియోగం గురించి గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రయాణికులకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ఈ యాప్ సాధారణ ప్రయాణ టికెట్లు రైల్వే స్టేషన్ నుంచి 15 మీటర్ల దూరంలో, ప్రయాణం ప్రారంభించే స్టేషన్ నుంచి 5 కిలో మీటర్ల పరిధిలో బుక్ చేసుకోవచ్చు. నగదు రహిత చెల్లింపులతో సాధారణ ప్రయాణ టికెట్లు ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలోని ఏ యూటీఎస్ స్టేషన్ నుంచి ఏ స్టేషన్‌కైనా సీజన్, ప్లాట్ ఫారం, సాధారణ ప్రయాణ టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. సీజన్ టికెట్‌ల రెన్యూవల్ పరిధి ముందుగానే చేసుకోవచ్చు. మొబైల్ ఫోన్‌లో సేవ్ అయి టికెట్‌ల బుకింగ్ వివరాలు ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ) కి చూపించవచ్చు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఈ యూటీఎస్ మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.

– ఎం.రామకృష్ణ, డీఆర్ఎం, గుంటూరు డివిజన్

క్రైస్తవ పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోండి



తెనాలిఅర్బన్: చెన్నైకు చెందిన ది లెమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో సత్యనారాయణ టాకీస్ రోడ్డులోని పుట్టి నాగేశ్వరరావు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రైస్తవ పుస్తక ప్రదర్శనను రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్‌చైర్మన్ డాక్టర్ జాషువా డానియేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలు, ప్రవక్తల జీవిత చరిత్రలు, బైబిల్‌కు సంబంధించిన అనేక విషయాలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆగస్టు 5వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన కొనసాగుతుందని, క్రైస్తవ పాటల పుస్తకాలు, బైబిల్స్, చర్చిలో ఏర్పాటు చేసుకునే వివిధ రకాల వస్తువులు ఇక్కడ విక్రయిస్తున్నట్లు చెప్పారు. క్రైస్తవులందరూ పుస్తక ప్రదర్శనను ఒకసారి దర్శించాలని కోరారు. కార్యక్రమంలో పుస్తక ప్రదర్శన కన్వీనర్ బ్రదర్ రూపస్, రెవరెండ్ డాక్టర్ ఏసురత్నం, డాక్టర్ ఆదం కెనడీ, డాక్టర్ బాబు సర్వోత్తమరావు, బ్రదర్ విజయ్, బ్రదర్ ఇశ్రాయేల్, బ్రదర్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు తీసుకోకపోవడంతో నగరపాలక సంస్థలో పనిచేసే ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు పడే పరిస్థితి లేదని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి బదిలీపై ఏపీ ట్రాన్స్ కో వెళ్లడంతో గుంటూరు నగర కమిషనర్‌గా దినేష్‌కుమార్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని ఇంత వరకు నూతన కమిషనర్‌గా దినేష్‌కుమార్ బాధ్యతలు తీసుకోకపోవడంతో నగరపాలక సంస్థ అప్కాస్ కింద విధులు నిర్వహిస్తున్న మూడే వేల మంది ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఎవరైతే కమిషనర్‌గా ఉంటారో వారు సీఎఫ్ఎంఎస్ వెబ్‌సైట్‌లో వేలిముద్ర వేస్తేనే ప్రభుత్వం జీతాలు మంజూరు చేస్తుందని వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారించాలని విన్నవించారు.

గ్రేడ్ 3 ఏఎన్ఎంలకు పెన్షన్ల పంపిణీ నుంచి మినహాయింపు ఇవ్వాలి



నెహ్రూనగర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్రేడ్– 3 ఏఎన్ఎంలకు సామాజిక పెన్షన్ల పంపిణీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ శ్యాంసుందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఒకే రోజు వ్యాక్సినేషన్, ట్రైనింగ్ కార్యక్రమాలు, సామాజిక పెన్షన్ కార్యక్రమాలు పంపిణీ ఉండటం వలన మూడు చేయడం సాధ్యపడదని ఇన్‌చార్జి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

చట్టాల గురించి అవగాహన ఏర్పరచుకోండి

1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వివేకవర్ధన్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వివేక్‌వర్ధన్

తెనాలిరూరల్: చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, అలాగే సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వివేకవర్ధన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు ఆదేశాల మేరకు స్థానిక సుల్తానాబాద్‌లోని జేఎంజే మహిళా కళాశాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సునుద్దేశించి న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండి చెడు స్నేహాల పట్ల ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి సారించాలన్నారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలన్నారు. సమాజం పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగం పట్ల అప్రమత్తతతో, అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. అదే విధంగా చట్టాలపై అవగాహన కూడా కలిగి సరైన మార్గంలోనే నడవాలన్నారు. విద్యార్థి దశ అత్యంత కీలకమని ఈ దశలో ఎటువంటి ఆకర్షణలకు లోను కాకుండా ఎవరికి కూడా వ్యక్తిగత భద్రతకు సంబంధించిన సమాచారాన్ని తెలియపరచకుండా జాగ్రత్తగా మసలుకోవాలని చెప్పారు. అదే విధంగా తమపై తల్లిదండ్రులు ఉంచిన బాధ్యతను గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాశరావు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలో వృద్ధుడి మృతదేహం

అంత్యక్రియలు చేసిన హెల్పింగ్ సోల్జర్స్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రకాశరావు

తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటలోని జండా చెట్టు పక్కన వీధిలో గల మురుగు కాల్వలో వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. ఉదయం మృతదేహం కాల్వలో పడి ఉండటాన్ని చూసిన స్థానికులు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న త్రీ టౌన్ ఎస్ఐ ఎస్. ప్రకాశరావు మురుగు కాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీయించారు. వృద్ధుని వివరాల కోసం ప్రయత్నించగా ఏమీ తెలియరాలేదు. వృద్ధుడికి సంబంధించిన కొన్ని వస్తువులు, సంచులు, చిల్లర డబ్బులు అక్కడే ఉండటంతో యాచక వృత్తి చేసుకుంటూ కొంతకాలంగా ఇక్కడే ఉంటున్నట్లు భావిస్తున్నారు. హెల్పింగ్ సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి షేక్ ఇనాయతుల్లాకి పోలీసులు సమాచారం ఇచ్చి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాల్సిందిగా కోరారు. స్పందించిన వారు అక్కడకు చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించి ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దీంతో చెంచుపేటలోని ఈద్గాకు మృతదేహాన్ని తరలించి అక్కడ ముస్లిం సాంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. మానవత్వంతో స్పందించి వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించిన సంస్థ ప్రతినిధి షేక్ ఇనయ్‌తుల్లా వారి మిత్ర బృందాన్ని పోలీసులతో పాటు స్థానికులు అభినందించారు. ఇదే కాకుండా కుల మత ప్రాంతాలకు అతీతంగా ఇప్పటి వరకు 1446 మందికి తమ చేతుల మీదుగా అంత్యక్రియలు నిర్వహించినట్లు హెల్పింగ్ సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఇనాయతుల్లా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీరావాలి, శివ, తేజ, హన్ను, రవి పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు పీఎన్ఆర్ సతీమణి శిరోమణి మృతి



చిగురుపాటి శిరోమణి (ఫైల్)



శిరోమణి పార్థవదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు మధు తదితరులు

తెనాలిఅర్బన్: జీవితంలో త్యాగాలకు పెట్టింది పేరు పరుచూరి నాగేశ్వరరావు కుటుంబమని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, జీ ఎంపీ మధు పేర్కొన్నారు. సీపీఎం నాయకుడు దివంగత పరుచూరి నాగేశ్వరరావు సతీమణి చిగురుపాటి శిరోమణి(88) మంగళవారం మృతి చెందారు. తెనాలి పురపాలక సంఘం పరిధిలోని ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆమె, కొంత కాలంగా కుమారుడు డాక్టర్ అజయ్‌కుమార్‌తో కలసి నెల్లూరులో ఉంటున్నారు. వయోభారంతో ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె మృతదేహాన్ని మంగళవారం రాత్రి తెనాలిలోని స్వగృహానికి కుటుంబ సభ్యులు తరలించారు. అంత్యక్రియలు బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన మధు మాట్లాడుతూ పరుచూరి నాగేశ్వరరావు సీపీఎం రాష్ట్ర నాయకులుగా అంకిత భావంతో పనిచేశారన్నారు. ఆయన సతీమణి శిరోమణి మృతి బాధాకరమన్నారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, జె.జయరాం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శివన్నారాయణ, వై.నేతాజి, షేక్ హుస్సేన్‌వలి, బి.అగస్టీన్, దుర్గాప్రసాద్, దిగురుపాటి శారద, శివరామకృష్ణయ్య, కె.కృష్ణ, కె.సుబ్బారావు, కె.సరళ కుమారి, మల్లికార్జున, ఉన్నారు.

సబ్జెక్టులపై అవగాహనతోనే పోటీ పరీక్షల్లో విజయం


జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

నెహ్రూనగర్: పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సబ్జెక్టులపై పూర్తి అవగాహన, పట్టుదల, క్రమశిక్షణతో చదవగలిగితే విజయం సాధ్యమని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ పేర్కొన్నారు. మంగళవారం రాజాగారితోటలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–2 మెయిన్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు మార్కెట్‌లో లభించే ప్రామాణిక పుస్తకాలను ప్రణాళికాబద్ధంగా అధ్యాయనం చేసి చదివినట్లయితే ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. ఆయా సిలబస్‌కు సంబంధించిన టెక్స్ట్ బుక్స్‌నే కాకుండా ప్రస్తుతం జరుగుతున్న అన్ని కరెంట్ అంశాలకు సంబంధించిన విషయాలపై పూర్తి అవగాహన కొరకు ప్రతి రోజు తెలుగు, ఇంగ్లిష్ పేపర్స్ తప్పకుండా చదువుతూ సొంత నోట్స్‌ను తయారు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్ష రాసే సమయంలో కష్టంగా ఉన్న బిట్స్‌ను టెక్నికల్‌గా ఆలోచించి ఎవరైతే కరెక్ట్ ఆన్సర్స్ చేయగలుగుతారో వారే అంతిమంగా విజయం సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు, హిస్టరీ ఫ్యాకల్టీ రఫీ, ఇండియన్ పాలిటీ ఫ్యాకల్టీ మార్కండేయులు పాల్గొన్నారు.

చేబ్రోలు వాసికి చెన్నై వర్సిటీ పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: చెన్నైలోని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ నుంచి 'న్యూరో ఎవల్యూషన్ ఆఫ్ న్యూరో సైక్రాటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ఇన్ బిహేవియర్ మోడ్స్ ఆఫ్ మైన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన కంచర్ల నాగరాజు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో అసిసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నాగరాజు శ్రీరామచంద్ర వర్సిటీ ఫార్మా విభాగ ఆచార్యులు డాక్టర్ అనూష పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆయన ఇటీవల పీహెచ్‌డీ పట్టా పొందారు.